సందుకో స్క్రాప్ దుకాణం



గెడ్డపై ఇష్టానుసారంగా ర్యాంప్‌లు నిర్మించి కార్యకలాపాలు చేస్తున్న స్క్రాప్ దుకాణం



దుకాణంలోని ఇనుప, ఇతర సామగ్రి

- నివాసాలను ఆనుకునే అగ్ని కుంపట్లు
- హైవేతో పాటు మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆనుకుని ఏర్పాటు
- ప్రభుత్వ స్థలాలు, గెడ్డలు, కాల్వలే అడ్డా
- ప్రమాదాలు జరిగినా కారణాలు నిగ్గు తేల్చని పోలీసులు

మధురవాడ: పేరుకే అవి చెత్త **సేకరించే దుకాణాలు**.. అక్కడ అనేక అక్రమ **కార్యకలాపాలు జరు**గుతున్నాయనడానికి ఎన్నో ని**దర్శనాలు కనిపిస్తు**న్నాయి. కొద్ది నెలల క్రితం ఈ **స్క్రాప్ దుకాణాల్లో** జరిగిన అగ్ని ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. పైగా ఈ దుకాణాలు జనావాసాలు, రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కనీస అనుమతులు, పోలీసుల నియంత్రణ లేకుండా పుట్టగొడుగుల్లా సందుకొక్కటి పుట్టుకు వస్తున్నా పట్టించుకునే వారే లేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త సేకరణ పేరుతో..

ఇక్కడ నివాస ప్రాంతాలతో పాటు జీవీఎంసీ డంపింగ్‌యార్డు వంటి ప్రదేశాల్లో పనికి రాని ఇనుప, పేపర్, రాగి, సిల్వర్, రబ్బరు, కరెంటు వైర్లు, కుర్చీలు, టేబుల్స్, రేకులు, ఇనుప ఊచలు, వాహనాల విడిభాగాలు, డబ్బాలు, ప్లాస్టిక్ సీసాలు, బీరు ఇతర సీసాలు, వాటి కప్పులు వంటివి రోడ్లపై ఏరుకుని, కొనుక్కుని వచ్చే వారి నుంచి సేకరిస్తారు. జీవీఎంసీ డంపింగ్ యార్డు, ఇతర ప్రభుత్వ సంస్థలు అయితే వీరికి కల్ప తరువులు. వీటితో పాటు నిర్మాణ రంగాల నుంచి కొత్త సరుకులు కూడా ఇక్కడికి చేరిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. ఆ వస్తువులే కాస్త రేటు తగ్గించి వీరు అమ్మకాలు నిర్వహిస్తుంటారు. ఎక్కడా దొరకని వస్తువులు ఇక్కడే ఉంటాయని రైల్వే, ఇతర పోలీసులు తనిఖీలు కూడా నిర్వహిస్తూ ఉంటారు.



మార్చిలో భారీ ప్రమాదం జరిగిన బోరవానిపాలెం వద్ద గల స్క్రాప్ దుకాణం

ఆ కేసులేమయ్యాయి?

- హైవేను ఆనుకుని బోరవానిపాలెం డంపింగ్ యార్డు జంక్షన్ చుట్టూ భారీ ఎత్తున ఇనుప రేకుల ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఉన్న స్క్రాప్ దుకాణంలో ఈ ఏడాది మార్చి 23న భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ.30లక్షలు పైనే ఆస్తి నష్టం జరిగిందని అంటున్నా, వాస్తవాలు నిగ్గు తేల్చలేదు. ఇందులో ఆయిల్‌తో పాటు విలువైన వస్తువులు కూడా ఉన్నాయన్నది ప్రమాదం తీరును బట్టి అర్థమవుతోంది.
- ఈ ఘటన జరిగిన మరో వారం రోజుల్లోనే మార్చి 29న జీవీఎంసీ 6వ వార్డు సాయిరాం కాలనీలో మరో ప్రమాదం చోటు చేసుకుంది. 2 ప్రాంతాలకు అగ్నిమాపక యంత్రాల ద్వారా సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.
- రెండేళ్ల క్రితం సంక్రాంతి రోజుల్లో మారికవలస ఆర్‌జీకే కాలనీలో మరో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అయినా కేసులేమయ్యాయో పోలీసులకే తెలియాలి.



హైవేను ఆనుకుని ఉన్న చంద్రంపాలెంలోని స్క్రాప్ దుకాణం

ఫిర్యాదు వస్తే తక్షణ చర్యలు

చంద్రంపాలెం వంటి చోట్ల 4 దుకాణాలు జీఎస్‌టీ ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీరు ఆక్షన్ ద్వారా వచ్చే సరకు కొనుగోలు చేస్తారు. సీపీ ఆదేశాల మేరకు అలాంటి వాటిల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. చాలామంది రోడ్లు పక్కన చెత్త ఏరుకున్న వారు ఉన్నారు. ఎక్కడైనా ఫిర్యాదు వస్తే తక్షణ చర్యలు చేపడతాం.

–శ్రీనివాస్, ఎస్‌ఐ, పీఎం పాలెం క్రైం పోలీస్ స్టేషన్

పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తూ..

జీవీఎంసీ డంపింగ్ యార్డును ఆనుకుని బోరవానిపాలెం, పరదేశిపాలెం, మారికవలస ఆర్‌జీకే కాలనీ, కొమ్మాది జంక్షన్ ఏరియాలు, మధురవాడ, చంద్రంపాలెం, నగరంపాలెం రోడ్డు, నగరంపాలెం-కళానగర్ మధ్య, వాంబే కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, రేవళ్లపాలెం రోడ్డు, కొమ్మాది రోడ్డు, స్వతంత్రనగర్, పీఎం పాలెం పరిసర ప్రాంతాలలో పదుల సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో, ఇళ్ల మధ్యనే దుకాణాలు ఏర్పాటు చేయడం మరింత ఇబ్బందికరంగా మారుతోందని వారు అంటున్నారు. కనీసం ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నగరంపాలెం చెరువు అడ్డాగా ఉన్న స్క్రాప్ దుకాణం

క్లుప్తంగా

వైభవంగా శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి



పూజలందుకున్న కృష్ణయ్య

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో రజత కృష్ణ పెరుమాళ్‌కి అభిషేకం, అర్చన చేశారు. సాయంత్రం ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి కదంబ, తులసి, వివిధ వర్ణాల పుష్పాలతో విశేష అర్చనలు చేశారు. మహిళలు సామూహిక పారాయణలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

పద్మనాభం: స్వస్థ్ నారీ శక్త్ పరివార్ (మహిళల ఆరోగ్యం కోసం)అభియాన్‌లో భాగంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని రేవిడి పీహెచ్‌సీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 18న పొట్నూరు, 19న కొవ్వాడ, 20న బాందేవుపురం, 22న మద్ది, 23న గంధవరం, 24న అనంతవరం, 25న నేరేళ్లవలస, 26న పద్మనాభం, 27న పాండ్రంగి, 29న కృష్ణాపురం, వచ్చే నెల ఒకటిన తునివలసలో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: బోని సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్ లైనులో మరమ్మతులు చేపట్టనున్నందున సంబంధిత గ్రామాలకు మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అనంతవరం, గంధవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ తిమ్మాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలియజేశారు.

రుణాలతో పాడి పశువులు కొనుగోలు చేయాలి

పద్మనాభం: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా పొందిన రుణాలతో పాడి పశువులు కొనుగోలు చేసుకోవాలని పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. తునివలసలో డ్వాక్రా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి పశువులను పక్క జిల్లాల్లో కొనుగోలు చేసుకుని వీటి ద్వారా వచ్చిన పాలను అమ్ముకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో పద్మనాభం, రెడ్డిపల్లి వీఏలు కె.మహేష్ కుమార్, అనూష పాల్గొన్నారు.

వంద పశువులకు గాలి కుంటువ్యాధి టీకాలు

పద్మనాభం: నాలుగు నెలలు పైబడిన పశువులకు రైతులు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పశువైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు.తునివలస, పద్మనాభం గ్రామాల్లో సోమవారం పశువైద్య శాఖ సిబ్బంది వంద పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీ వరకు తమ సిబ్బంది పశువులకు ఈ టీకాలు వేస్తారన్నారు.

దివ్యాంగుల పెన్షన్ల కోసం కలెక్టర్‌కు వినతి

తగరపువలస: ఆనందపురం మండలంలోని దివ్యాంగులందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని కోరుతూ మండల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కొత్తలంక దేవుడు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 2010 నుంచి అమలులో ఉన్న సదరం సర్టిఫికెట్ల ఆధారంగా పెన్షన్లు కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో దివ్యాంగుల మహిళా అధ్యక్షురాలు పి.కనకమహాలక్ష్మి, కార్యదర్శి వై.అప్పలకొండ ఉన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి

పద్మనాభం: మండలంలోని అనంతవరం పంచాయతీ గొల్లలపాలెంలో డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ ప్రజలు సోమవారం ఎంపీడీవో ఎం.విజయ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌లకు వినతి పత్రాలు ఇచ్చారు. పూర్వం నుంచి తమ గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడం వల్ల వర్షపు నీరు, ఇంట్లో వాడకం నీరు పైకి వెళ్లే మార్గం లేక గ్రామంలోనే నిలిచి పోతోందని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కె.శివ, ఎ.ఎర్రినాయుడు, బి.రాము, సీహెచ్ గోవింద తదితరులున్నారు.

కదిలిన యంత్రాంగం

- ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



నగరపాలెం ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలపై అధికారులు దృష్టి సారించారు. ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆదేశాల మేరకు ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 4వ తేదీన 'బీచ్ రోడ్డులో భూ మాయాజాలం' శీర్షికతో సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో సోమవారం వీఆర్వో ప్రసాద్ ఆద్వర్యంలో కాపులదిబ్బడపాలెం సర్వే నెంబరు 314లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అనధికార నిర్మాణాలను తొలగించి.. దీనికి సమీపంలో ఆక్రమించేందుకు చదును చేసిన ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



కాపులదిబ్బడపాలెంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు కూల్చివేస్తున్న అధికారులు

- కె. నగరపాలెం పరిధి ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తి సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. వాటిని కూడా అధికారులు స్వాధీనం చేసుకుని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలకు గాయాలు

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండ నుంచి ఎండాడ వెళ్లే ప్రధాన రహదారిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఎంకె గోల్డ్ కోస్ట్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళను వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే స్పందించి ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటోంది.

- సోమవారం ఉదయం అదే దారిలో ఓ మహిళ ద్విచక్ర వాహనంపై రుషికొండ వెళ్తుండగా.. ఎంకె గోల్డ్ కోస్ట్ సమీపంలోని మలుపు డివైడర్ వద్ద విద్యుత్ స్తంభానికి కట్టిన వైర్లు ఆమె వాహనం అద్దానికి తగలడంతో అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది. ఆమెను రుషికొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ రెండు రోడ్డు ప్రమాదాలకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ యాజమాన్యం ప్రహరీ దాటి రహదారిని స్టాపర్లతో ఆక్రమించి రాకపోకలను స్తంభింపచేయడమే కాకుండా, తమ వ్యాపారాలకు విఘాతం కలిగిస్తోందని ఆరోపిస్తూ ఆ రహదారిలోని వ్యాపారులు థియేటర్ ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. థియేటర్ యాజమాన్యం రహదారిని సొంత ఆస్తిలా భావిస్తూ, ఇష్టారాజ్యంగా మొక్కలు వేసి, ఎత్తు పెంచి స్టాపర్లు అడ్డుగా పెట్టి వాహనాలు రాకుండా అడ్డు పడుతోందన్నారు. థియేటర్ నుంచి చావుల మదుం రోడ్డు ఎఫ్‌ఎంబీ ప్రకారం వెడల్పుగా ఉండేదన్నారు. ఈ రోడ్డు పొడవునా వ్యాపారాలతో పాటు నివాస గృహాలు ఉన్నాయన్నారు. థియేటర్ యాజమాన్యం రహదారిని కబ్జా చేస్తున్నా చర్యలు తీసుకోవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఒమ్మి అయ్యప్ప నాయుడికి వినతి పత్రం అందించారు. నిరసనలో పిట్ట సురేష్, కొల్లా మహేష్, వాసుపల్లి కనకరాజు, రామోజు సతీష్, శేఖరమహంతి శ్రీను, జీరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి హాజరు కాని అధికారులకు మెమోలు

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 17 అర్జీలు

మధురవాడ: పీజీఆర్‌ఎస్‌కు 11గంటల సమయం దాటిన తర్వాత వచ్చిన అధికారులకు మెమోలు జారీ చేయాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి సూపరింటెండెంట్ అప్పలరాజును ఆదేశించారు. ఆర్‌ఐలతో పాటు ఇతర సెక్షన్ అధికారులు కూడా సమయానికి హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చంద్రంపాలెం దుర్గానగర్ ఎంట్రన్స్ వద్ద ఉన్న 40 అడుగుల రోడ్డు ఆక్రమణల వలన కనీసం 15 అడుగులు కూడా మిగలలేదని దుర్గా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పిళ్లా సూరిబాబు, నాగబాబు తదితరులు వినతి పత్రం ఇచ్చారు. పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 17 అర్జీలు రాగా అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగానివే ఉన్నాయి. కార్యక్రమంలో ఈఈ శాంతి రాజు, డీఈ మణికుమార్, టీపీవో శ్రీలక్ష్మి, ఎస్ఎస్ శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

జోన్-1కు 12 వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్పీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు 12 వినతులు వచ్చాయి. ఇందులో ప్రజారోగ్యానికి సంబంధించి నాలుగు, ఇంజినీరింగ్ విభాగానికి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి మూడు వినతులు, రెవెన్యూ విభాగానికి ఒక వినతి ఉన్నాయి.



జోన్-2 పీజీఆర్‌ఎస్‌లో ఉదయం 11.30 దాటిన తర్వాత కూడా ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

ఆర్డీవో కార్యాలయానికి 8 దరఖాస్తులు

ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో పలు సమస్యలకు సంబంధించి ఎనిమిది వినతులు వచ్చాయి. వాటిని స్వీకరించిన ఆర్డీవో, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వీసీ ఎరోల్ డిసౌజా

కొమ్మాది: దేశం మెచ్చిన గొప్ప ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతి సందర్భంగా గీతం కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి వర్సిటీ వీసీ ఆచార్య ఎరోల్ డిసౌజా పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటితరం యువ ఇంజినీర్లు జాతి నిర్మాణంలో పాలు పంచుకోవాలని, సమకాలిన సాంకేతిక పరిజ్ఞానంతో అవకాశాలను పెంచుకోవాలని ఆకాంక్షించారు. దేశానికి ఇంజినీరింగ్ నిపుణులు వెన్నెముకలాంటి వారని, యువత అంకిత భావంతో ఈ రంగంలో నైపుణ్యం సాధించాలని సూచించారు.

సర్వీస్ రోడ్డు డ్రైనేజీల్లో పూడిక తొలగించారు



సబ్బివానిపేట వద్ద సర్వీస్‌రోడ్డు డ్రైనేజీలో తొలగించిన పూడిక

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సబ్బివానిపేట సర్వీస్‌రోడ్డును ఆనుకుని ఉన్న డ్రైనేజీల నుంచి సోమవారం పూడిక తొలగించారు. ఇటీవల డ్రైనేజీలు పూడుకుపోవడంతో వీటి నుంచి మురుగు నీరు రహదారిపైకి పొంగి పొర్లుతుండటంతో 'సర్వీస్ రోడ్డు మురుగుమయం' శీర్షికతో సోమవారం సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన హైవే సిబ్బంది డ్రైనేజీపై సిమెంట్ పలకలు తొలగించి పూడిక తీసి, తరలించారు.

ఉత్తమ హిందీ ప్రచారకునిగా ప్రసాదరావు

తగరపువలస: ఉత్తమ హిందీ ప్రచారకునిగా భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు టీఎస్‌వీ ప్రసాదరావుకు జేసీఐ వైజాగ్ గ్రీన్ సిటీ సోమవారం అవార్డు బహూకరించింది. ప్రిజం 110 జేసీఐ వారోత్సవాలలో భాగంగా జాతీయభాష అభివృద్ధికి ఆయన చేసిన కృషి గుర్తిస్తూ ఈ అవార్డు అందించారు. గ్రీన్ సిటీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సునీతరెడ్డి, చైర్‌పర్సన్ డి.సుష్మ, కార్యదర్శి కె.నవ్యత, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

'మాటలు తప్ప చేతల్లేని కూటమి ప్రభుత్వం'

తగరపువలస: కూటమి ప్రభుత్వానికి మాటలు తప్ప చేతలు లేవని సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అర్హులకు పెన్షన్లు ఇస్తామన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కొత్త పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు కమిషనర్ అభినందన

దాబాగార్డెన్స్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, భీమిలి జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అభినందించారు. ఆయన చాంబర్‌లో సోమవారం ఆమెను ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉపాధ్యాయిని ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. విద్యార్థులకు మంచి బోధనను అందించడంతో పాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల స్థానం సమాజంలో ఉన్నతమైనదన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి మరింతగా కృషి చేయాలని ఆమెను కోరారు.



ఉత్తమ ఉపాధ్యాయిని తిరుమల శ్రీదేవిని అభినందిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

బస్సులు నిలపడం లేదని చిన్నయ్యపాలెంలో ఆందోళన

రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, మహిళలు



నీళ్లకుండీలు-విజయనగరం రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, మహిళలు



చిన్నయ్యపాలెం కూడలి వద్ద ఆర్టీసీ బస్సులను అడ్డుకున్న కుసులవాడ పంచాయతీ ప్రజలు

తగరపువలస: సింహాచలం నుంచి విజయనగరం వెళ్లే సిటీ బస్సులు ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ చిన్నయ్యపాలెం కూడలిలో వారం రోజులుగా నిలపకపోవడంతో స్థానికులు సోమవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. మహిళలు, విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించారు. చెట్ల కొమ్మలు విరిచి రోడ్డుకు అడ్డంగా ఉంచారు. ఈ కూడలి నుంచి విద్యార్థినులు గిడిజాల హైస్కూల్‌కు 5 కిలోమీటర్లు, శిర్లపాలెం హైస్కూల్‌కు 3 కిలోమీటర్లు బస్సులపై ప్రయాణించి చేరుకోవలసి ఉంది. అయితే, బస్సులు నిలపని కారణంగా ఈ మార్గంలో శిర్లపాలెం, గిడిజాల జెడ్పీ హైస్కూళ్లకు వెళ్లే బాలికలు వారం రోజులుగా పాఠశాలలకు వెళ్లలేదు. బస్సులను నిలిపివేయడంతో సిబ్బంది మాట్లాడుతూ చిన్నయ్యపాలెం కూడలిలో బస్‌స్టాప్ లేదని తప్పించుకోవాలని చూశారు. స్త్రీశక్తి పథకం ముందు ఈ కూడలిలో బస్సులు నిలిపేవారు కదా అని మహిళలు, విద్యార్థులు నిలదీయగా అప్పుడు టిక్కెట్లు తీసేవారు కాబట్టి నిలిపేవారమని, ఇప్పుడు టిక్కెట్లు తీయడం లేదని తమ అధికారులు నిలపవద్దన్నారని వితండవాదం చేయడంతో విద్యార్థులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు వంద మంది మహిళలు గంటకు పైగా పాల్గొన్నారు. చివరికి తమ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని సిబ్బంది చెప్పడంతో మహిళలు శాంతించారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్

తగరపువలస: మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మహిళా ఏఎస్‌ఐ సుశీల సూచించారు. మధురవాడ జోన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు సోమవారం ఈ యాప్ గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో మహిళలు ఈ యాప్‌ను ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ (సేఫ్ ట్రావెల్) ఆప్షన్‌పై నొక్కితే 10 సెకన్ల నిడివి కలిగిన ఆడియో, వీడియో ఆటోమేటిక్‌గా రికార్డు అయి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందన్నారు. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి, పోలీస్ సిబ్బంది నాగేశ్వరరావు, బి.శివ, కె.జగదీష్, ఎ.హరిత తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మహిళా ఏఎస్‌ఐ సుశీల

ఆరు తడి పద్ధతితో అధిక దిగుబడులు

పద్మనాభం: ఆరుతడి పద్ధతి అవలంబించడం వల్ల వరి పంటలో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని కొత్త కొవ్వాడలో ఆరు తడి పద్ధతిపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరు తడి పద్ధతిలో భాగంగా ఒక నీటి పరికరాన్ని వరి పైరులో పెట్టడం వల్ల పంటకు నీరు ఎక్కువ, తక్కువ లేకుండా ఉంటుందన్నారు. పంటకు అవసరమైన నీరు అందుతుందన్నారు. పిలకల శాతం పెరుగుతుందని, విద్యుత్ శక్తి ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నకాయల రత్నం, ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, ఎంఎంటీఎల్ గణేష్ కుమార్, ఎంటీ విద్యాసాగర్, డీఎంఎంటీ బోని దుర్గారావు, యూనిట్ ఇన్‌చార్జి అప్పలనాయుడు, ఎల్.బంగారునాయుడు పాల్గొన్నారు.

• 30 వసంతాల స్నేహ సౌరభం



మూడు దశాబ్దాల స్నేహానుగంధం పరిమళించింది. వారి అపూర్వ కలయికకు సాగర్‌నగర్‌లోని ఓ రిసార్ట్ వేదికైంది. డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల బీకాం (ఇంగ్లీష్ మీడియం) 1992–95 బ్యాచ్ 30 వసంతాలు పూర్తయిన సందర్భంగా సోమవారం పెరల్ అలుమ్ని మీట్ నిర్వహించింది. 30 మందికి పైగా దేశ, విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కాలేజీ రోజుల్లో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి స్మృతులతో ఆనందంగా గడిపారు. అనంతరం నాటి తమ అధ్యాపకుడు పి. ప్రకాశ్‌రావును ఘనంగా సత్కరించారు.

–కొమ్మాది